

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

నిత్యం పెరుగుతున్న నిత్యావసరాల ధరలు తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో మీకోసంలో జేసీకి అర్జీ అందజేశారు. - 8లో..



కలెక్టర్ ఉత్తర్వులనూ లెక్కచేయం

మర్రిపూడి మండలం గుండ్లసముద్రంలో 200 ఎకరాల పశువుల మేత పోరంబోకు భూమి ని టీడీపీ నాయకులు ఆక్రమించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 34 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

వాగ్దేవీ వందనం



ఒంగోలు అచలానందాశ్రమంలో సరస్వతీదేవి అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో అమ్మవారిని రోజుకో రీతిలో అలంకరిస్తున్నారు. మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం అమ్మవారు జ్ఞాన రూపిణి అయిన సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

- సాక్షి, ఒంగోలు

న్యూస్‌రీల్

27 వార్డులుగా దర్శి నగర పంచాయతీ

దర్శి: ప్రస్తుతం 20 వార్డులుగా ఉన్న దర్శి నగర పంచాయతీని 27 ఎలక్షన్ వార్డులుగా పునర్విభజన చేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ మహేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పలు కార్యాలయాల్లో నోటీసులు అంటించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఏపీ మున్సిపాలిటీ చట్టం 1995 ప్రకారం జీఓ ఎమ్ఎస్ నంబర్ 61 ప్రకారం వార్డు విభజనలో పురపాలక సంఘం వార్డులను 27 వార్డులుగా తయారు చేశారన్నారు. విభజన హద్దులను దర్శి పురపాలక సంఘ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రధాన తపాలా కార్యాలయం, దర్శి పరిధిలోని అన్నీ వార్డుల సచివాలయాల్లో నోటీసు బోర్డులో ప్రజల సౌకర్యార్థం ఉంచారన్నారు. ప్రచురించిన ముసాయిదా వార్డుల విభజనకు సంబంధించి ప్రజల సూచనలు, సలహాలు అక్టోబర్ 6వ తేదీ లోపు పురపాలక సంఘ కార్యాలయంలో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టౌన్ ప్లానింగ్ అధికారి షేక్ రహమ్‌తుల్లా, సిబ్బంది శ్రీకాంత్ ఉన్నారు.

జిల్లాలో గ్రామీణ వైద్యం పూర్తిగా పడకేసింది. ఒకవైపు కూటమి పాలకుల నిర్లక్ష్యం.. మరోవైపు ప్రాథమిక వైద్యశాలల వైద్యుల సమ్మె వెరసి గ్రామీణ ప్రజలకు వైద్యం అందకుండా పోతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో గ్రామాలకు గ్రామాలే జ్వరాలతో మంచంపట్టాయి. పీహెచ్‌సీల్లో సరైన వైద్యం అందక గత్యంతరం లేని పరిస్థితుల్లో రోగులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, పాలకులు కేవలం కంటితుడుపు చర్యలకు పరిమితమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.



జరుగుమల్లి మండలం చింతలపాలెంలో మూతపడిన విలేజ్ హెల్త్ క్లినిక్

■ గ్రామీణ వైద్యం..గాలిలో దీపం

పల్లెనాడి పట్టేదెవరు..!

- పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టడంతో ఆందోళనలో గ్రామీణ ప్రజలు
- విధులకు హాజరైనా సాధారణ ఓపీ చూడని పీహెచ్‌సీ వైద్యులు
- వైద్యుల సమ్మెపై నిర్లక్ష్యం వహిస్తున్న కూటమి పాలకులు
- డిమాండ్లు సాధించుకునే వరకు వెనక్కి తగ్గేది లేదంటున్న వైద్యులు
- సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా పట్టించుకోని పాలకులు
- విష జ్వరాలతో మంచం పట్టిన గ్రామాలు
- 7 డెంగీ కేసులు మాత్రమే వచ్చినట్లు చెబుతున్న వైద్యారోగ్య శాఖ అధికారులు
- మలేరియా, చికున్ గున్యా జ్వరాలు లేవని బుకాయింపు

ఒంగోలు టౌన్:

వరసగా వారం రోజులుగా వర్షాలు కురవడంతో జిల్లాలో ఏ గ్రామంలో చూసినా జ్వరాలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లో కూడా జ్వరంతో జనం విలవిల్లాడిపోతున్నారు. సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. వర్షాలకు మంచినీరు కలుషితమైపోవడంతో చాప కింద నీరులా విరేచనాలు ప్రబలుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా పంచాయతీరాజ్, పురపాలక శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవడంతో పాటు, వైద్యులను సమ్మెలోకి వెళ్లకుండా చూడాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మూలుగుతున్న నక్క మీద తాటికాయ పడిన చందంగా ప్రాథమిక వైద్యుల సమ్మెతో అసలే అంతంత మాత్రంగా అందుతున్న వైద్య సేవలు కూడా కొండెక్కాయి. దాంతో గ్రామీణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె..

జిల్లాలో 64 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీ ఇద్దరేసి వైద్యులు ఉండాలి. ప్రస్తుతం జిల్లాలో 148 మంది వైద్యులు పనిచేస్తున్నారు. మూడు రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు అనివార్య పరిస్థితుల్లో స్టెతస్కోప్ పక్కన పెట్టేశారు. దీంతో గ్రామీణ వైద్యం పడకేసింది. నిజానికి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించడంలో పీహెచ్‌సీ వైద్యులదే కీలకపాత్ర. గతంలో పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు పీజీలో 30 శాతం సీట్ల కోటా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే ఏకపక్షంగా సీట్ల కోటాను 15 శాతానికి తగ్గించేసింది. ఉన్నత విద్య మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న ఎంబీబీఎస్ వైద్యుల ఆశలపై నీళ్లు చల్లింది. దాంతో వైద్యులు ఆందోళన బాట పట్టారు. అప్పటికి దిగివచ్చిన ప్రభుత్వం 20 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఒక ఏడాది మాత్రమే దాన్ని అమలు చేసిన కూటమి పాలకులు ఆ తరువాత దాన్ని పట్టించుకోకుండా దగా చేశారు. ఈ సమస్యపై గత కొన్నాళ్ల నుంచి పీహెచ్‌సీ వైద్యులు ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నారు. పాలకులు అస్సలు పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె బాట పట్టారు.



పాతంపల్లిలో ఇంటిలోనే సెలైన్ బాటిల్ పెట్టించుకున్న రాములమ్మ

సమ్మెతో మూతపడిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో జరుగుమల్లి మండలంలోని చింతలపాలెం గ్రామంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ సోమవారం మూతవేశారు. సాధారణంగా ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ఈ క్లినిక్‌ను తెరుస్తారు. సింగరాయకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఇక్కడ వైద్యశాల తెరచినా వైద్యుడు విధులకు హాజరుకాలేదు. స్టాఫ్ నర్స్ ఒక్కరే రోగులకు సేవలు అందించారు. జరుగుమల్లిలో ఫోన్‌లో రోగి పరిస్థితి వైద్యుడికి వివరించి చెప్పి ఆయన సలహా మీద రోగులకు మందులు ఇచ్చి పంపించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు వైద్యుడు లేకపోవడంతో నిరాశగా వెనుతిరిగిపోయారు. పెద్దారవీడు మండలంలో జ్వరాలతో గ్రామాలకు గ్రామాలే మంచం పట్టాయి. మండలంలోని పాతంపల్లి, తమ్మడపల్లి, దేవరాజుగట్టు, స్థానికవరం, బద్వీడు చెర్లోపల్లి గ్రామాలలో ప్రజలు విష జ్వరాలతో అల్లాడిపోతున్నారు. పోతంపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న చట్లమిట్ల ప్రాథమిక వైద్యశాల వైద్యులు సమ్మెలో ఉండడంతో వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. గిద్దలూరు మండలంలో విషజ్వరాలతో ప్రజలు వణికిపోతున్నారు. నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న పలు గ్రామాల్లో చలిజ్వరం, మలేరియా లక్షణాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో డెంగీ లక్షణాలు అధికంగా కనిపిస్తున్నట్లు ప్రైవేటు వైద్యులు చెబుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, బేస్తవారిపేట, రాచర్ల, అర్ధవీడు, కొమరోలు, గిద్దలూరు పీహెచ్‌సీలలో సోమవారం వైద్యులు విధులకు హాజరైనా సాధారణ ఓపీకి వైద్య సేవలు అందించలేదని సమాచారం. పాత ఓపీ చూపించి కొందరు రోగులు ఫార్మాసిస్ట్ వద్ద మందులు తీసుకెళ్లడం కనిపించింది. దర్శిలో కూడా ఇదే పరిస్థితి ఉంది. మండలంలో పీహెచ్‌సీ వైద్యులు విధులకు హాజరై సంతకాలు చేశారు. నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న యర్రగొండపాలెం, పుల్లలచెరువు, అర్ధవీడు మండలాల్లో మలేరియా లక్షణాలతో కూడిన జ్వరంతో ప్రజలు బాధపడుతున్నారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని తండాల ప్రజలకు సకాలంలో వైద్య సహాయం అందక గిరిజనులు ఆర్‌ఎంపీ వైద్యుల వద్దకు చికిత్స కోసం వస్తున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు..

వారం రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా జ్వరాలు విజృంభిస్తున్నాయి. తీవ్రమైన జ్వరాలతో జనం వైద్యుల దగ్గరకు పరిగెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంది. అక్కడ పీహెచ్‌సీలలో వైద్య సేవలు ఆగిపోవడంతో ప్రజలు ఆర్‌ఎంపీ వైద్యుల దగ్గరకు వెళ్లక తప్పనిసరి పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్‌ఎంపీ వైద్యుల ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. అరకొర వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కొండపిలో ఆర్‌ఎంపీ వైద్యుడి చికిత్స వికటించి ఒక రోగి మరణించడం తెలిసిందే. ఈ ఘటనతో జిల్లా ప్రజల్లో భయాందోళన నెలకొంది. అయినా ప్రాథమిక వైద్యశాలల వైద్యులు సాధారణ ఓపీలు చూడకపోవడంతో చికిత్స కోసం పీహెచ్‌సీలకు వెళ్లిన రోగులు ఉసూరుమంటూ తిరిగి వస్తున్నారు.

7 డెంగీ కేసులే వచ్చినట్లు తప్పుడు లెక్కలు..

జిల్లాలో డెంగీ, చికున్ గున్యా, మలేరియా జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు మాత్రం కేవలం మూడు నెలల్లో కేవలం 7 డెంగీ కేసులు మాత్రమే వచ్చినట్లు చెప్పడం గమనార్హం. జిల్లా కేంద్రమైన ఒంగోలులో కూడా డెంగీ జ్వరంతో బాధపడుతున్న వారున్నారు. బాపూజీ కాంప్లెక్స్‌లో హోల్ సేల్ వ్యాపారి ఒకరు ఇటీవల తీవ్రమైన జ్వరంతో స్థానిక ప్రైవేటు వైద్యశాలకు వెళ్లారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ జ్వరం సోకినట్లు నిర్ధారించారు. వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలలకు వెళుతున్నారు. గిద్దలూరు మండలంలోని కేఎస్ పల్లె పంచాయతీలోని ప్రతాప్ రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న చైతన్య రెడ్డి, దేవ గణేష్ రెడ్డి అనే కవల పిల్లలు ఇటీవల డెంగీ బారిన పడ్డారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డెంగీ జ్వరాలకు సంబంధించిన సమాచారాన్ని డీఎంహెచ్ఓ కార్యాలయానికి తెలియజేయాల్సి ఉంటుంది. ప్రైవేటు వైద్యశాలల యాజమాన్యాలు నిబంధనలను బేఖాతరు చేస్తూ డెంగీ సమాచారాన్ని డీఎంహెచ్ఓ కార్యాలయానికి అందించడంలేదని తెలుస్తోంది. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా పీహెచ్‌సీ వైద్యుల సమ్మెను విరమింపచేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

శక్తిరూపిణి అయిన ఆదిపరాశక్తి దానవ సంహారానికి కాళికామాత అవతారం దాల్చి భక్తుల కోరిక మేరకు తన ప్రతిరూపంగా ఇచ్చినట్లు భావించే కళారాలు దుర్గాష్టమి, మహార్నవమి రోజుల్లో ఒంగోలు పురవీధుల్లో దర్శనమిస్తాయి. దసరా ఉత్సవాల్లో జిల్లాకు ప్రత్యేకమైన ఈ కళారాల ఊరేగింపు.. వాటి విశిష్టత తెలుసుకుందాం..

కళారాల కళకళ

- దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకి మైసూరు తరువాత ఒంగోలు కళారాల ప్రత్యేకత
- తొలిసారిగా పంచలోహ కనకదుర్గ కళారం ఊరేగింపు
- ఒంగోలు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తజనం
- మేళతాళాలతో అమ్మవారి వేషధారణలో కళాకారుల నృత్య ప్రదర్శన
- నేడు మూడు కళారాల ఊరేగింపు

ఒంగోలు మెట్రో: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో రోజుకొక అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఒంగోలు నగరంలో అర్ధరాత్రి పూట జరిగే కళారాల వేడుకలకు జిల్లా నలు వైపుల నుంచి ప్రజలు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వారి మొక్కులు తీర్చుకుంటారు. దసరా నవరాత్రుల్లో ముఖ్యమైన దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి రోజున కళారాల ఊరేగింపు, నగరంలోని వివిధ దేవాలయాల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపునకు పారువేట వేడుకలకు ఒంగోలు నగరం ముస్తాబైంది. మంగళవారం మూడు కళారాలు ఊరేగించనుండగా, బుధవారం మరో మూడు కళారాలకు నగరోత్సవం నిర్వహించనున్నారు. మైసూర్ తర్వాత ఒంగోలుకే ఈ కళారాల ఉత్సవం ప్రత్యేకం.

వందలేళ్ల నాటి చరిత్ర:

ఒంగోలులో జరిగే కళారాల ఉత్సవానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పట్లో చిన్న గూడు బండ్లు కట్టుకొని అమ్మవారి కళారాన్ని ఊరేగిస్తూ తప్పెట్లు వాయిస్తూ కాగడాలు పట్టుకొని అర్ధరాత్రి నుంచి నగరం మొత్తం తిరిగేవారు. తెల్లవారే వరకు ఈ సందడి కొనసాగేది. ఎంత రాత్రి అయినా సరే తమ వీధిలోకి వస్తున్న కళారాన్ని చూసి అమ్మవారికి హారతులు సమర్పించి ఆశీస్సులు అందుకునేవారు. ఇప్పటి కాలంతోపాటు ఉత్సవ తీరులోనూ ఆధునికత చోటు చేసుకుంది. అదిరిపోయే డీజే, బాణసంచా శబ్దాలతో దేవాలయాల నుంచి వీధుల్లోకి ఊరేగింపుగా వచ్చే అమ్మవారి కళారాన్ని దర్శిస్తే మళ్లీ ఏడాది వరకు ఎలాంటి దుష్ట శక్తుల పీడ, ఈతి బాధలు ఉండవని భక్తుల నమ్మకం.



కాళికాదేవి కళారం

భక్తుల కొంగుబంగారం ఆరు కళారాలు...

ఒంగోలు మొత్తం ఆరు కళారాలు ఉన్నాయి. స్థానిక బాలాజీరావుపేటలో కనకదుర్గాదేవి, గంటపాలెంలో పార్వతీదేవి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర బాలా త్రిపుర సుందరీ దేవి, నరసింహ స్వామి, ఏనుగు చెట్టు దగ్గర ఉన్న అంకమ్మపాలెం కాళికాదేవి, కేశవ స్వామిపేటలోని మహిషాసుర మర్ధిని కళారాలు ఉన్నాయి. నాలుగు కళారాలు పసుపు వర్ణంతో, కాళికాదేవి ఎర్రగా, నరసింహ స్వామి తెల్లగా ఉంటారు. ఈసారి బాలాజీరావు పేటలోని కనక దుర్గమ్మ కళారం నూతనంగా తయారు చేశారు. సుమారు 50 కేజీల పంచలోహాలతో అమ్మవారి కళారాన్ని తయారుచేసి నగరోత్సవం నిర్వహిస్తున్నామని దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం రాత్రి బాలాజీరావు పేటలోని కనకదుర్గమ్మ అంకమ్మపాలెంలోని కాళికా దేవి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర బాలా త్రిపుర సుందరీ దేవి, నగర ఉత్సవానికి బయలుదేరుతాయి. నగరంలోని వేరువేరు మార్గాల్లో పయనించి బుధవారం ఉదయం మస్తాన్ దర్గా సెంటర్ దగ్గరకు చేరుకుంటాయి. బుధవారం అర్ధరాత్రి కేశవస్వామి పేటలోని మహిషాసుర మర్ధిని, గంటాపాలెంలోని పార్వతీదేవి కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర నరసింహ స్వామి కళారాల ఉత్సవం అంగరంగ వైభవంగా జరుగుతాయి.



బాలాజీరావు పేటలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో 50 కేజీల పంచలోహ కనకదుర్గమ్మ కళారం

కళారం అంటే...

ఒకసారి రక్త బీజుడు అనే రాక్షసుడుతో అమ్మవారు యుద్ధం చేయాల్సి వచ్చింది. అతని శిరస్సును ఖడ్గంతో ఖండిస్తుంది. రక్తం ధారలుగా నేల మీద పడుతుంది. ప్రతి రక్తపు చుక్క నుంచి మళ్లీ ఒక రక్త బీజుడు పుట్టుకొస్తాడు. బ్రహ్మదేవుడు ఆ రాక్షసుడికి ఇచ్చిన వరంతో అమ్మవారితో యుద్ధం చేస్తూ పోటీగా నిలబడతాడు. అమ్మవారు తన శక్తి నుంచి నల్లని కాళీ రూపాన్ని సృష్టించి కాళికాదేవిగా దేవిగా మారి పెద్ద నాలుకతో రక్తబీజుడి నుంచి కారే రక్తపు బొట్టును భూమి మీద పడకుండా తాగేస్తూ ఆ రాక్షసుడి శక్తిని హరించి అంతం చేస్తుంది. అప్పుడు ప్రజలంతా కాళికా మాతకు జయ జయ ధ్వానాలు పలికి అమ్మవారిని తమ మధ్య ఉండి పోవాలని కోరగా దానికి అమ్మవారు "అలా కుదరదు, ముల్లోకాలు రక్షణ బాధ్యత నాదే కదా. మీ కోరిక ప్రకారం ప్రజలందరికీ దుష్టశక్తుల భయం లేకుండా నా అంశంతో నిబిడీకృతమైన కళారాన్ని నోరు తెరిచి ఉన్న శిరస్సు భాగం ప్రసాదిస్తున్నాను. ఆ రూపాన్ని పూజించి ఆరాధించండి. దసరా నవరాత్రులలో దుర్గాష్టమి, మహార్నవమి రోజుల్లో అర్ధరాత్రి కళారాన్ని నగరసంచారం చేయించండి. నగరంలోని దుష్టశక్తులన్నీ పారిపోతాయని" అమ్మవారు అభయమిస్తుంది. విష్ణుమూర్తి తత్వమైన నరసింహ స్వామి కళారంగా వచ్చి మిమ్మల్ని తరింప చేస్తానని అమ్మవారు వరమిస్తుంది. అని పెద్దలు చెబుతారు. ఈ విధంగా ప్రారంభమైనదే మన కళారాల చరిత్ర.

డిమాండ్ల సాధనకే వైద్యుల సమ్మె

- ఎమర్జెన్సీ కేసులకు మాత్రమే సేవలు
- జిల్లా వ్యాప్తంగా 64 పీహెచ్‌సీల్లో నిలిచిన వైద్యసేవలు
- పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే రాహుల్

మార్కాపురం: తమ డిమాండ్ల సాధన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సమ్మెబాట పట్టారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 64 పీహెచ్‌సీల్లో వైద్యులు ఓపీని బాయ్‌కాట్ చేసి అత్యవసర కేసులకు మాత్రమే సేవలు అందించినట్లు ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే రాహుల్ తెలిపారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించడం, టైం బౌండ్ ప్రమోషన్లను అమలు చేయడం, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి బేసిక్‌పే 30 శాతం ట్రైబల్ అలవెన్సు మంజూరు చేయడం, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద రూ.5 వేలు అలవెన్సు, నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టినట్లు డాక్టర్ రాహుల్ తెలిపారు. వీటితోపాటు వైద్యులకు కచ్చితమైన పనిగంటలు, జాబ్ చార్టు ఇవ్వడం, నాన్‌మెడికల్ వ్యక్తులు విచ్చలవిడిగా తనిఖీలు చేయకుండా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. ఈ డిమాండ్లను ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పెండింగులోనే ఉన్నాయని తెలిపారు. కరోనా సమయంలో కూడా తాము సేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు. కాగా మార్కాపురం డివిజన్‌లో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని 27 పీహెచ్‌సీలో వైద్యులు వైద్యశాలకు వచ్చిన రోగుల్లో అత్యవసర చికిత్స అవసరమైన వారికి అందజేశారు.

వికసిత్ భారత్ క్విజ్‌లో యువత పాల్గొనాలి

ఒంగోలు సిటీ: దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో జరిగే వికసిత్ భారత్ క్విజ్ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని యువతకు కల్పిస్తున్నట్లు స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ యువజనోత్సవంలో భాగంగా వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌ను రూపొందిస్తారని తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ నాలుగు దశల్లో ఉంటుందన్నారు. ఈ క్విజ్‌లో పాల్గొనేందుకు 15 నుంచి 29 సంవత్సరాల వయసున్న వారు అర్హులన్నారు. 2025 అక్టోబర్ 15లోపు క్విజ్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎటువంటి దరఖాస్తు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. యువతీ యువకులు 'మై భారత్ పోర్టల్' ద్వారా వికసిత్ భారత్ క్విజ్‌లో పాల్గొనాలని సూచించారు.

వలంటీర్ విధుల నుంచి విముక్తి కలిగించండి

- నిరసన వ్యక్తం చేసిన వార్డు సచివాలయ కార్యదర్శులు



నిరసన తెలుపుతున్న వార్డు సచివాలయ కార్యదర్శులు

ఒంగోలు సబర్బన్: వలంటీర్ విధుల నుంచి విముక్తి కలిగించాలని కోరుతూ ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం ముందు వార్డు సచివాలయ ఉద్యోగులు సోమవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర ఉమ్మడి ఐక్యవేదిక నూతన కమిటీ పిలుపు మేరకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ వార్డు సెక్రటరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీ మహా విష్ణు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకి డోర్ టు డోర్ సర్వీసెస్, సర్వేలు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు 21 విభాగాల్లో ఉన్న ఉద్యోగులందరికీ జిల్లా డీఎస్సీ ద్వారా మెరిట్ లిస్ట్ తయారుచేసి అవకాశం ఉన్నంత వరకు ప్రమోషన్స్ కల్పించాలన్నారు. సచివాలయ ఉద్యోగుల్లో టెక్నికల్, ప్రొఫెషనల్ ఉద్యోగులకి గ్రేడ్ 1,2,3 అనే విధానం రద్దు చేయాలని కోరారు. అందర్నీ డైరెక్ట్ డిజిగ్నేషన్‌తో గుర్తించాలన్నారు. బీఎల్ఓ డ్యూటీ సచివాలయ ఉద్యోగులందరికీ పూర్తిగా తొలగించి గతంలో ఉన్న వారికే అప్పగించాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రికార్డ్ అసిస్టెంట్ స్కేలు పూర్తిగా తొలగించి కనీసం బేసిక్ జూనియర్ అసిస్టెంట్ స్కేల్ అమలు చేయాలన్నారు. అక్టోబర్ 2 నాటికి ఆరేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ స్పెషల్ ఇంక్రిమెంట్ ఒకటి ఇవ్వాలని కోరారు. అదనపు డ్యూటీ ఇన్చార్జిగా చేసినప్పుడు వాళ్లకి ప్రత్యేక శాలరీ మంజూరు చేయాలన్నారు. రావాల్సిన సరెండర్ లీవ్స్ వెంటనే క్యాష్ చేసుకునేలా అప్డేట్ చేయాలన్నారు. అలాగే గతంలో ప్రొబేషన్ లేట్ అయినందుకు ఎనిమిది నెలల అరియర్స్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు వారి మాతృ శాఖలు గుర్తించి వారి అండర్లో నడిచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జనరల్ సెక్రటరీ ఎస్‌కే.రహంతుల్లా, కోశాధికారి షేక్ గౌస్ భాష పాల్గొన్నారు.

కలెక్టర్ ఉత్తర్వులనూ లెక్కచేయం..!

- 200 ఎకరాల పశువుల మేత భూమిని యథేచ్ఛగా ఆక్రమించిన పచ్చనేతలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు


పశువుల మేత భూమిని దున్నేసిన దృశ్యం


వెబ్‌ల్యాండ్‌లో నమోదైన పేర్లు

మద్దిపూడి: కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక పచ్చనేతల అవినీతి అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ప్రభుత్వ భూములను సైతం యథేచ్ఛగా ఆక్రమిస్తూ పశువుల మేత భూమిని కూడా మేసేస్తున్నారు. పలువురు పచ్చనేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెవెన్యూ అధికారుల అండతో మేత భూమికి వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేయించుకుని ఏకంగా పట్టాదారు పాసుపుస్తకాలు తెచ్చుకున్నారు. దీనిపై కలెక్టర్ ఉత్తర్వులను కూడా లెక్కచేయకుండా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఆ వివరాల్లోకెళ్తే.. మద్దిపూడి మండలంలోని గుండ్లసముద్రం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 571లో 207.86 ఎకరాల విస్తీర్ణంలో పశువుల మేత భూమి ఉంది. ఆ భూమిలో మండలంలోని ఎస్టీరాజుపాలెం, గుండ్లసముద్రం, కోష్టాలపల్లి, రేగలగడ్డ గ్రామాలకు చెందిన పశువులను మేపుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు, కాసులకు కక్కుర్తిపడి పశువుల బీడును సబ్‌డివిజన్ చేసి మరీ పచ్చనేతల పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. సుమారు 200 ఎకరాల మేత భూమిని పలువురు ఆక్రమించుకుని యథేచ్ఛగా అనుభవిస్తున్నారు. ఈమేత భూమి ఆక్రమణపై 'పశువుల బీడు ఫలహారం' అనే శీర్షికతో ఈ ఏడాది మే 17న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. పశువుల మేత భూమిని ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలంటూ అప్పటి కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు గుండ్లసముద్రం గ్రామస్తులు ఫిర్యాదు కూడా చేశారు. విచారించి ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఉన్న పేర్లను తొలగిస్తామని కలెక్టర్, జేసీ హామీ ఇచ్చారు. ఆ మేరకు కింది స్థాయి అధికారులకు ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు సమాచారం. కానీ, నేటికీ క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఇదే అదనుగా భావించిన ఆక్రమణదారులు పశువుల మేత భూమిని యథేచ్ఛగా ఆక్రమించి దున్నుకుంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మిన్నకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారుల నుంచి మేతభూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ నాగరాజును 'సాక్షి' వివరణ కోరగా, ఈ విషయం తనకు తెలియదని, స్థానిక వీఆర్‌ఓను అడిగి తెలుసుకుని చెబుతానని అన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

అర్ధవీడు: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని కోరిన వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ మల్లికార్జున తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. అర్ధవీడు మండలం గన్నెపల్లి గ్రామానికి చెందిన నల్లబోతుల బాల వెంకటయ్య(53) వద్ద అదే గ్రామానికి చెందిన షేక్ చిన్న అబ్దుల్ ఖాదర్ అలియాస్ చుట్టలోడు ఏడాది క్రితం రూ.15 వేల నగదు అప్పుగా తీసుకున్నాడు. బాకీ తీర్చాలని కొద్ది నెలలుగా అడుగుతున్నప్పటికీ చిన్న అబ్దుల్ ఖాదర్ స్పందించడం లేదు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం సమయంలో గ్రామ ప్రధాన సెంటర్‌లో ఉన్న అబ్దుల్ ఖాదర్‌ను అప్పు చెల్లించాలని వెంకటయ్య కోరాడు. దీంతో అబ్దుల్ ఖాదర్ 'ఏంట్రా నా కొడకా.. ఇంత మంది జనాల మధ్యలో నన్ను అప్పు గురించి అడుగుతావా' అంటూ పక్కనే ఉన్న మంచం కర్ర తీసుకుని వెంకటయ్యనూ దాడికి పాల్పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి హుటాహుటిన యాచవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వెంకటయ్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై శివనాంచారయ్య కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు చిన్న అబ్దుల్ ఖాదర్ సోమవారం మధ్యాహ్నం నాగులవరం నుంచి కాకర్ల వెళ్లే రోడ్డులో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

గ్రామ బహిష్కరణ సమస్య పరిష్కారం


బాధిత కుటుంబం, గ్రామ కాపులతో చర్చిస్తున్న ఎస్సై సుధాకర్‌బాబు

కొత్తపట్నం:

మాజీ సర్పంచ్ కుటుంబం గ్రామ బహిష్కరణ సమస్య ప్రశాంతంగా పరిష్కారమైంది. మండలంలోని ఈతముక్కల పంచాయతీ చెంచుపాపాయిపాలెం పట్టపుపాలెంలో మాజీ సర్పంచ్ బసంగారి ప్రసాద్ కుటుంబాన్ని గ్రామకాపులు ఆ గ్రామం నుంచి బహిష్కరించి అతని ఇంటికి తాళం వేయడంతో బాధిత కుటుంబం ఆదివారం సాక్షి దినపత్రికను ఆశ్రయించింది. దీనిపై 'మాజీ సర్పంచ్ కుటుంబం గ్రామ బహిష్కరణ' అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రిక జిల్లా పేజీలో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన కొత్తపట్నం ఎస్సై వేముల సుధాకర్‌బాబు సిబ్బందితో సోమవారం ప్రసాద్ ఇంటికి చేరుకుని సమస్య తెలుసుకున్నారు. గ్రామ కాపులను పిలిపించి ఏం జరిగిందో తెలుసుకున్నారు. గ్రామంలో ప్రసాద్ తీసుకున్న డబ్బు రూ.60 వేలు రెండు రోజుల్లో తిరిగి చెల్లించే విధంగా ఒప్పందం కుదిర్చి అతని ఇంటికి వేసిన తాళాలను గ్రామ కాపులతోనే తీయించారు. తన జీవనోపాధిని కూడా నిలిపివేశారని ఎస్సై ముందు ప్రసాద్ వాపోయాడు. దీంతో ఎస్సై మాట్లాడుతూ ప్రసాద్ జీవనోపాధిని నిలిపివేసే హక్కుగానీ, అతని తల్లి చర్చికి వెళ్తే అడ్డుకునే హక్కుగానీ ఎవరికీ లేదని స్పష్టం చేశారు. అతని ఇంటికి కుళాయి కనెక్షన్‌ను కూడా తిరిగి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించండి

- కలెక్టర్ రాజాబాబు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

కనిగిరిరూరల్: అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించేలా దృష్టి సారించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక పవిత్ర ఫంక్షన్ హాలులో సోమ వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై 814 అర్జీలు వచ్చాయని, వాటిలో 70 శాతం రెవెన్యూకి సంబంధించిన అర్జీలే ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో అర్జీల సంఖ్య తగ్గించాలని, అందుకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనలతో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. . వైశాల్యం పరంగా జిల్లా విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున సమస్యలు విన్నవించుకునేందుకు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ప్రజలు ఎంతో వ్యయప్రయాసలకు లోనవుతారన్నారు. అందుకే ప్రజల వద్దకే వచ్చి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఎక్కడ జరిగితే అక్కడికే అధికారులంతా వస్తే ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కనిగిరి, మార్కాపురం ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణ, కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, డీఆర్ఓ చిన్న ఓబులేసు, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, పార్థసారథి, జాన్సన్‌లు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

- ఎస్పీ హర్షవర్ధన్ రాజు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు టౌన్: బాధితుల సమస్యలు పరిష్కరించినప్పుడే పోలీసులపై నమ్మకం పెరుగుతుందని, బాధితుల ముఖాల్లో సంతోషం కనిపిస్తుందని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 105 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..వేదికలో వచ్చిన ఫిర్యాదులపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువు లోగా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలను సత్వరమే విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్లలో కానీ, సబ్ డివిజన్లలో కానీ ఫిర్యాదులను అందజేయాలని సూచించారు. మహిళా పోలీసు డీఎస్పీ వీవీ రమణకుమార్, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, మార్కాపురం సీఐ సుబ్బారావు, కొండపి సీఐ సోమశేఖర్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.

పాస్టర్‌పై హత్యాయత్నం చేసిన వారిని శిక్షించాలి

ఒంగోలు టౌన్:

కనిగిరి మండలం మాచవరం గ్రామంలో పాస్టర్‌గా పనిచేస్తున్న కుడుముల ప్రకాశంపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదు చేసినట్లు పాస్టర్ తల్లి కుడుముల విజయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం గ్రామంలో సొంత స్థలంలో చర్చి నిర్మించడం జీర్ణించుకోలేక కక్షకట్టి దాడి చేసినట్లు తెలిపారు. పాస్టర్‌ను కులం పేరుతో దూషిస్తూ విచక్షణారహితంగా దాడి చేశారని, ఫోన్ పగులగొట్టారని ఆరోపించారు. ఈ ఘటనపై కనిగిరి సీఐ, ఎస్సైలకు ఫిర్యాదు చేయడానికి వెళితే తీసుకోలేదని ఆరోపించారు. పాస్టర్‌పై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

- 14 రకాల సరుకులను చౌక ధరల దుకాణాల ద్వారా అందించాలి
- మీ కోసం కార్యక్రమంలో జేసీకి అర్జీ అందజేత


మీ కోసం కార్యక్రమంలో అర్జీ ఇస్తున్న ఐద్వా నాయకులు

ఒంగోలు సబర్బన్: నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించి సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా అధికారులకు అర్జీ అందజేశారు. జేసీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రకాశం భవన్‌లోని పీజీఆర్ఎస్ భవన్‌లో ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ 14 రకాల సరుకులను చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వమే ప్రజలకు అందించాలన్నారు. ధరల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. గత ఆరు నెలలుగా రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని, కంది పప్పు, నూనె ఊసే లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో కందిపప్పు, నూనె, నిత్యావసర వస్తువులన్నీ ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వాహనాల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేసేవారని, ఈ ప్రభుత్వం దాన్ని రద్దు చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకే వాహనాలు రద్దు చేశామనడం సమంజసంగా లేదన్నారు. రేషన్ షాపులు ఉన్న కాలంలోనూ, వాహనాలు నడిచిన కాలంలోనూ, నేడు కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందన్నారు. అక్రమాలను అరికట్టాలంటే ప్రజలు తినగలిగే సన్న బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా అందించాలని కోరారు. రేషన్ షాపుల ద్వారా తినడానికి వీలైన నాణ్యమైన బియ్యం అందిస్తే అక్రమాలు క్రమంగా ఆగిపోతాయన్నారు. ధరలకు అనుగుణంగా సామాన్యులకు వేతనాలు పెరగడం లేదన్నారు. అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న ధరల వల్ల సామాన్య ప్రజానీకం పౌష్టికాహారాన్ని తినలేకపోతున్నారని, ఫలితంగా మహిళలు, చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి తోడు ప్రభుత్వాలు ఎగుమతి, దిగుమతుల్లో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, ధరల పెరుగుదలకు అవి మరింత ఆజ్యం పోస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శి కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి : జేసీ గోపాలకృష్ణ

ప్రజల నుంచి వస్తున్న అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు నాణ్యతతో పరిష్కరించాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రకాశం భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో మాట్లాడారు. తన పరిధిలో ఉన్న వాటిపై వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో చర్చించారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజల అర్జీలు పునరావృతమయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 227 అర్జీలు ఆయా శాఖలలో పునరావృతం అయ్యాయన్నారు. నిబంధనల ప్రకారం సరైనవో, కావో చూడాలని, సరైనవి కాకుంటే అర్జీదారులకు వివరించాలని సూచించారు. గడువులోగా అర్జీలను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. గడువు తీరిన అర్జీలు 15 ఆయా శాఖలలో పెండింగ్‌లో ఉండటంపై జేసీ ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీవో కళావతి, సబ్ కలెక్టర్లు వరకుమార్, మాధురి, విజయ, జ్యోతి కుమారి, వరలక్ష్మి, అనుబంధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పన్ను తగ్గింపుపై అవగాహన కల్పించాలి

- అవగాహన ర్యాలీని ప్రారంభించిన జేసీ గోపాలకృష్ణ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: వస్తుసేవల పన్ను తగ్గింపు ఫలాలు ప్రజలందరికీ చేరేలా అవగాహన కల్పించాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. వస్తు సేవల పన్ను తగ్గింపుపై ఏర్పాటు చేసిన ర్యాలీని స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జెండా ఊపి ఆయన ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ.. అద్దంకి బస్టాండ్ వరకు సాగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను తగ్గింపు ఫలాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జేసీ కోరారు. వస్తు సేవా పన్నుల సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజలకు నేరుగా ఆర్థిక లబ్ధి చేకూరుతుందని వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరుతో నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు వారాలు చేపట్టే ఈ కార్యక్రమాలను ఒక్కొక్క అంశంతో ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ప్రజలు అవగాహన పొందితే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మాలోని పొదుపు సంఘాల మహిళలు, వివిధ వాణిజ్య సంఘాల ప్రతినిధులు, ప్రజలు, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 1న పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు

ఒంగోలు సబర్బన్: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అక్టోబర్ 1వ తేదీ ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని పాత జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తామన్నారు. సఫాయీ మిత్ర సురక్షా సేవా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరానికి జీజీహెచ్ వైద్యులతో పాటు ఒంగోలు నగరంలోని ప్రముఖ ప్రైవేటు వైద్యశాలల స్పెషలిస్టులు కూడా హాజరై సేవలందిస్తారని, పారిశుధ్య కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.